నేడు గ్రూప్-1 ప్రిలిమినరీ

సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల

- 21 పరీక్షా కేంద్రాల్లో జరుగనున్న పరీక్ష
- నిమిషం ఆలస్యమైనా అనుమతి నిరాకరణ
- పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

సిద్దిపేట అర్బన్, జూన్ 8 : జిల్లా కేంద్రం లోని 21 పరీక్షా కేంద్రాల్లో నేడు జరిగే గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరుగనుంది. మొత్తం 21 పరీక్షా కేంద్రాల్లో 8,223 మంది అభ్యర్థులు గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష రాయనున్నారు. ఉదయం 10 గంటల తర్వాత పరీక్షా కేంద్రం గేట్లు మూసివేస్తామని.. నిమిషం ఆలస్యమైనా అభ్యర్థులను అనుమతించమని అధికారులు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడం జరుగుతుందని సిద్దిపేట పోలీస్ కమిషనర్ బి.అనురాధ తెలిపారు. పరీక్షా కేంద్రాల నుంచి 500 మీటర్ల వరకు ప్రజలెవరూ గుమిగూడవద్దని.. సమీపంలోని జిరాక్స్ సెంటర్లు, ఇంటర్‌నెట్ సెంటర్లు, లౌడ్ స్పీకర్లు మూసివేయాలన్నారు. పరీక్ష కోసం ఇద్దరు అడిషనల్ డీసీపీలు, నలుగురు ఏసీపీలు, 14 మంది సీఐలు, 21 మంది ఎస్సైలు, 257 మంది ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, మహిళా కానిస్టేబుళ్లు, హోంగార్డులు కలిపి మొత్తం 298 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పరీక్షా కేంద్రంలోకి బ్యాగులు, సెల్ ఫోన్లు, స్మార్ట్ ఫోన్లు, వాచీలు, కాలిక్యులేటర్లు తదితర ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించమని తెలిపారు.

ఐవీఎఫ్ లోగో ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఐవీఎఫ్ సేవలను విస్తృతపర్చాలి

- ఎమ్మెల్సీ యాదవరెడ్డి

గజ్వేల్, జూన్ 8: ఐవీఎఫ్ సంస్థ సేవలను మరింత విస్తృత పర్చాలని ఉమ్మడి మెదక్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి అన్నారు. శనివారం గజ్వేల్ పట్టణంలో ఆసంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళిగుప్తా అధ్యక్షతన రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ యాదవరెడ్డి మాట్లాడుతూ గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో గజ్వేల్ పట్టణంలో ఆర్యవైశ్యుల అభ్యున్నతికి ఎంతగానో కృషిచేశారన్నారు. ఆర్యవైశ్యభవన నిర్మాణం, స్థలసేకరణ కోసం కోట్లాది రూపాయలు ఖర్చుచేసి వారి సంక్షేమం కోసం పాటుపడినట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఐవీఎఫ్ చేస్తున్న ఆర్థికపరమైన చేయూతను గ్రామగ్రామాన విస్తృతపర్చి మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఐవీఎఫ్ లోగోను ఆవిష్కరించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశా రు. కార్యక్రమంలో ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, ఐవీఎఫ్ జాతీయ, జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ గుప్తా, యువజన విభాగం అధ్యక్షులు సంతోష్‌గుప్తా, స్వప్న, ప్రభాకర్, శ్రవణ్, గోలి సంతోష్ పాల్గొన్నారు.

భువనగిరి ఎంపీని కలిసిన ప్రశాంత్‌రెడ్డి

చేర్యాల, జూన్ 8 : ఇటీవల భువనగిరి ఎంపీగా విజయం సాధించిన చామల్ల కిరణ్ కుమార్‌రెడ్డితో పాటు నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డిని కాంగ్రెస్ యూత్ రాష్ట్ర నాయకుడు కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి హైదరాబాద్‌లోని వారి నివాసంలో శనివారం కలిశారు. ఈ సందర్భంగా ఎంపీలకు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అన్ని విధాలుగా సహకరించాలని, అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని ప్రశాంత్‌రెడ్డి ఎంపీని కోరారు.

నల్లగొండ, భువనగిరి ఎంపీలతో కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి

స్నాతకోత్సవాన్ని విజయవంతం చేయాలి

ములుగు, జూన్ 8: ములుగులోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయంలో ఈనెల 11న జరిగే 3వ స్నాతకోత్సవాన్ని విజయవంతం చేయాలని వీసీ డాక్టర్ నీరజా ప్రభాకర్ కోరారు. శనివారం వర్సిటీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా గవర్నర్, వర్సిటీ చాన్స్‌లర్ రాధాకృష్ణన్, తమిళనాడు అగ్రికల్చర్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ గీతాలక్ష్మి హాజరు కానున్నట్లు తెలిపారు. స్నాతకోత్సవంలో భాగంగా విద్యార్థినీ, విద్యార్థులకు డిగ్రీ, పీజీ పట్టాలు అందజేయనున్నట్లు ఆమె తెలిపారు.

మాట్లాడుతున్న వీసీ నీరజా ప్రభాకర్

మల్లన్న భూముల పై విచారణ చేపట్టాలి

చేర్యాల, జూన్ 8: నిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేసే సీపీఎం పార్టీని అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు విమర్శిస్తే సహించేది లేదని ఆపార్టీ కొమురవెల్లి మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొమురవెల్లి ఆలయ చైర్మన్ పదవిని పర్వాటకం లక్ష్మారెడ్డి రూ.25 లక్షలకు కొనుగోలు చేసి నాలుగు నెలల్లో పెద్ద మొత్తంలో సంపాదించినట్లు ఆరోపించారు. చేర్యాలలో మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి వెంచర్ చేసి మూడు ఎకరాల భూమి పంచాయతీకి ఇవ్వలేదని, వెంచర్ నిబంధనలు పాటించలేదని మున్సిపల్ అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు.కొమురవెల్లి క్షేత్రంలోని ఆలయ పరిధిలో ఉన్న భూములను అధికార పార్టీ నేతలు కొల్లగొడుతున్నారని, దేవాదాయశాఖ అధికారులు విచారణ చేపట్టాలన్నారు. సమావేశంలో మాజీ సర్పంచ్ తాడూరి రవీందర్, నాయకుల బద్దిపడిగె కృష్ణారెడ్డి, అత్తిని శారద, దాసరి ప్రశాంత్, తేలు ఇస్తారి, బాలకిషన్, నరేశ్, భరత్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సత్తిరెడ్డి

అన్నదానం మహాదానం

సిద్దిపేట టౌన్, జూన్ 8: అన్నదానం మహాదానం అని సిద్దిపేట వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు మర్యాల వాణి అన్నారు. పట్టణంలోని నిరాశ్రయుల ఆశ్రమంలో శనివారం క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో వీరేశం, స్వప్న, రవికుమార్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న వనిత క్లబ్ ప్రతినిధులు

బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

మద్దూరు: గాగిల్లాపూర్‌లో బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

మద్దూరు(ధూళిమిట్ట), జూన్ 8: బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని మద్దూరు మండలంలోని గాగిల్లాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం గుడిసె అంజయ్య అన్నారు. శనివారం గాగిల్లాపూర్‌లో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కారు బడిలోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందన్నారు. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన ఉంటుందన్నారు. అంతకుముందు ఇంటింటికీ వెళ్లి పిల్లలను బడిలో చేర్పించాలని తల్లిదండ్రులను ఉపాధ్యాయులు కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్వర్ణకుమార్, ప్రేమ్‌కుమార్, కనకయ్య, నర్సింహులు, ఆంజనేయులు, అనురాధ, సరోజినిదేవి, సుహాసిని పాల్గొన్నారు.

ముత్తన్నపేటలో..

బెజ్జంకి, జూన్ 8: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ఆధ్వర్యంలో శనివారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న విద్య, మౌలిక వసతులు, పథకాలు, విద్యార్థులు సాధిస్తున్న ఫలితాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బడిబాటలో ఉపాధ్యాయులు

హుస్నాబాద్‌టౌన్, జూన్ 8: సర్కారు బడిలో అన్నిరకాల సదుపాయాలు ఉన్నాయంటూ విద్యార్థులు, వారి తల్లి దండ్రులకు ఉపాధ్యాయులు వివరిస్తున్నారు. హుస్నాబాద్ పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలలకుచెందిన ఉపాధ్యాయులు శనివారం బడిబాట నిర్వహించారు. ఈ సందర్భంగా సకల సౌకర్యాలు సర్కారుబడిలోనే ఉన్నాయని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో కస్తూర్బాకాలనీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ధనలక్ష్మి, ఆర్పీ జోత్స్న జోత్స్న, ఉపాధ్యాయులు వీరారెడ్డితోపాటు పలువురు పాల్గొన్నారు.

హుస్నాబాద్: మాట్లాడుతున్న జడ్జి శివరంజని

గజ్వేల్: మాట్లాడుతున్న ప్రియాంక

రాజీమార్గమే రాజమార్గం

- హుస్నాబాద్ మున్సిఫ్ కోర్టు జడ్జి శివరంజని

హుస్నాబాద్, జూన్ 8: రాజీమార్గమే రాజమార్గమని మున్సిఫ్‌కోర్టు జడ్జి శివరంజని అన్నారు. శనివారం హుస్నాబాద్ కోర్టు ఆవరణలో జరిగిన జాతీయ లోక్ అదాలత్‌ను ఆమె ప్రారంభించి మాట్లాడారు. క్షణికావేశంలో ఒకరిపై ఒకరు పెట్టుకున్న చిన్న చిన్న కేసుల కోసం ఏండ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, డబ్బులను వృథా చేసుకుంటున్నారన్నారు. అనంతరం లోక్ అదాలత్‌లో పలు కేసుల విచారణ చేశారు. లోక్ అదాలత్‌లో మొత్తం 686 కేసులు పరిష్కారమైనట్లు కోర్టు అధికారులు తెలిపారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు పరిధిలోని 282కేసులు, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు పరిధిలోని 404కేసులు పరిష్కారమయ్యాయి. కార్యక్రమంలో పీపీ నాగరాజు, ఏజీపీ కన్నోజు రామకృష్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

గజ్వేల్ కోర్టులో...

గజ్వేల్, జూన్ 8: గజ్వేల్ కోర్టులో శనివారం జరిగిన జాతీయ లోక్‌అదాలత్‌లో రాజీపడదగిన క్రిమినల్ కేసులు, బ్యాంక్ కేసులు అన్ని కలిపి దాదాపు 2064 కేసులు పరిష్కరించినట్లు లీగల్ సర్వీస్ మండల కమిటీ చైర్మన్, ప్రిన్సిపల్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రియాంక తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రాజీమార్గమే రాజమార్గమని, చిన్న చిన్న సమస్యలతో కక్షలు పెంచుకుంటున్నారన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పాండరి, న్యాయవాదులు నర్సింహులు, మండల లీగల్ సెల్ సిబ్బంది నర్సింహచారి, యామిని పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌కు స్పందన

సిద్దిపేట టౌన్,జూన్8 : కక్షిదారుల నుంచి స్పందన వచ్చిందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి అన్నారు.జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా కోర్టు ఆవరణలో జరిగిన లోక్ అదాలత్‌ను ఆమె ప్రారంభించారు. రాజీ ద్వారా క్రిమినల్, మోటారు ప్రమాద, గృహహింస, చెక్‌బౌన్స్, ప్రీ లిటికేషన్ కేసులను పరిష్కరించారు. మోటారు వాహన ప్రమాద కేసుల బాధితులకు పరిహారం ఇచ్చారు. జడ్జిలు స్వాతిరెడ్డి,మిలింద్ కాంబ్లే, చందన, శ్రావణి, న్యాయవాదులు జనార్దన్‌రెడ్డి,బాబురావు, ప్రవీణ్‌రెడ్డి, సత్యనారాయణ, రవీందర్, ప్రకాశ్, రాజిరెడ్డి,రాములు పాల్గొన్నారు.

సిద్దిపేట లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న న్యాయమూర్తి సాయిరమాదేవి

ఆలయాల్లో భక్తుల పూజలు

నాచగిరిలో సామూహిక వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

వర్గల్, జూన్ 8: వర్గల్ విద్యాసరస్వతీ మాత ఆలయం, నాచగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవాలయాలు శనివారం రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన భక్తులతో సందడిగా మారాయి. వేసవి సెలవులు ముగుస్తుండడంతో పెద్దసంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. అర్చనలు, దేవుడిపేరిట లగ్నాలు, మొక్కుబడుల చెల్లింపులు, కొత్త వాహన పూజలు నిర్వహించారు. నాచగిరిలో సామూహిక సత్యనారాయణ వ్రతాల్లో కుటుంబసమేతంగా పాల్గొని సత్యదేవుడి మొక్కుతీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయాల నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

రామోజీ మృతి తీరని లోటు

చేర్యాల, జూన్ 8: పద్మభూషణ్ అవార్డు గ్రహీత, ఈనాడు గ్రూప్స్ చైర్మన్ రామోజీరావు మృతి తెలుగు రాష్ట్రాల ప్రజలకు తీరని లోటని సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు అందె అశోక్ అన్నారు.పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం రామోజీరావు మృతిపై సంతాప సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఈరి భూమయ్య, జంగిలి యాదగిరి, ఎల్లయ్య, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్‌లో..

గజ్వేల్,జూన్ 8: ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు అకాల మరణం రెండు తెలుగురాష్ట్రాలకే కాకుండా దేశవిదేశాల్లో ఉంటున్న తెలుగు ప్రజలకు తీరనిలోటని ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు దేవీరవీందర్ ప్రకటనలో తెలిపారు. పత్రిక, టీవీ, వ్యాపార రంగాల్లో తనదైన ముద్ర వేసిన వ్యక్తి రామోజీరావు అని కొనియాడారు.

రామోజీసేవలు మరువలేనివి

హుస్నాబాద్, జూన్ 8: పత్రికారంగంలో రామోజీరావు చేసిన సేవలు మరువలేనివని పలువురు వక్తలు అన్నారు. శనివారం సాయంత్రం హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో అఖిపక్ష పార్టీలు, జర్నలిస్టులు, ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్, వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనితారెడ్డి, మాజీ చైర్మన్ సుద్దాల చంద్రయ్య, స్ఫూర్తి అసోసియేషన్ అధ్యక్షుడు పందిల్ల శంకర్, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, జర్నలిస్టులు నన్నె అజయ్‌కుమార్, పిట్టల తిరుపతి, గాజుల రాజు, వివిధ పార్టీల నాయకులు కేడం లింగమూర్తి, అయిలేని మల్లికార్జున్‌రెడ్డి, చిట్టి గోపాల్‌రెడ్డి, ఇంద్రాల సారయ్య, దొడ్డి శ్రీనివాస్, వెన్న రాజు పాల్గొన్నారు.

రామోజీరావుకు నివాళి

సిద్దిపేట టౌన్,జూన్ 8: ఈనాడు గ్రూప్స్ అధినేత రామోజీరావు మృతి చెందడం బాధాకరమని టీయూడబ్ల్యూజే ఐజేయూ జిల్లా అధ్యక్షుడు రంగాచారి అన్నారు.స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం రామోజీరావు మృతికి సంతాపం వ్యక్తం చేసి నివాళులర్పించారు. పాత్రికేయులు సత్యనారాయణ, రాజిరెడ్డి, రమణారావు, పాండు, రఘునందన్, అరుణ్, మైసారెడ్డి, దుర్గారెడ్డి, జనార్దన్, శ్రీనివాస్, మజ్జు, సాజిద్, ఇంద్రసేనారెడ్డి, యాదవరెడ్డి, ఎల్లోహర్, రమణారెడ్డి, శ్రీనాథ్, భాస్కర్, మురళీకృష్ణ, గిరి, నరేశ్, మహేశ్, నగేశ్, కలీమ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫామ్‌లు అందించాలి

- టైలరింగ్ యూనిట్‌ను సందర్శించిన డీఆర్డీవో

హుస్నాబాద్‌రూరల్, జూన్ 8: మండలంలోని పోతారం(ఎస్) గ్రామంలోని శ్రీశక్తి స్వశక్తి టైలరింగ్ యూనిట్‌ను శనివారం డీఆర్డీవో జయదేవ్‌ఆర్య సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన యూనిఫామ్‌లు కుట్టే విధానంపై మహిళలనుఅడిగి తెలుసుకున్నారు. త్వరలో పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు యూనిఫామ్‌లు తొందరగా అందించాలని సూచించారు. ఆయన వెంట జిల్లా ప్రాజెక్టు మేనేజర్ విద్యాసాగర్, సెర్ప్ ఏపీఎం జి. శ్రీనివాస్ గౌడ్, ఏపీఎంలు ప్రకాశ్, తిరుపతిగౌడ్, డీఎంజీ ప్రసాద్, సీసీలు భిక్షపతి, శివచరణ్ సింగ్, రవీందర్, వీవోఏ కనకతార, యమునా, లక్ష్మి, మహిళలు ఉన్నారు.

టైలరింగ్ యూనిట్‌ను పరిశీలిస్తున్న డీఆర్డీవో జయదేవ్‌ఆర్య

మృగశిరకార్తె.. చేపల కోసం ఎగబడ్డ జనం

హుస్నాబాద్‌టౌన్: చేపలు కొనేందుకు వచ్చిన జనం

సిద్దిపేట చేపల మార్కెట్‌లో కొనుగోలు దారుల సందడి

హుస్నాబాద్‌టౌన్, జూన్ 8: చేపలు తినే కార్తెరానేవచ్చింది. శనివారం మృగశిర కార్తె రోజు హుస్నాబాద్ పట్టణంలో భారీగా చేపల విక్రయాలు జరిగాయి. స్థానిక పాత రెవెన్యూ కార్యాలయంలో నిర్వహిస్తున్న చేపల మార్కెట్‌కు చేపలు కొనేందుకు ప్రజలు వచ్చారు. ఆస్తమాలాంటి పలు వ్యాధులు దూరమవుతాయనే నమ్మకం ఉండటంతో చేపలు కొనుగోలు చేసేందుకు జనం ఎగబడ్డారు.

సిద్దిపేటలో..

సిద్దిపేట, జూన్ 8: సిద్దిపేట పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ప్రాంగణంలోని చేపల మార్కెట్‌కు జనం పోటెత్తారు. చేపల కోసం జనాలు రావడంతో సందడి నెలకొంది. కొర్రమీను, రొటతో పాటు ఇతర రకాల చేపలను కొనుగోలు చేశారు. శనివారం మృగశిర కార్తె కావడం.. ఉబ్బసంతో బాధపడుతున్న చాలామంది చేప మందు తీసుకుంటారు.

దుబ్బాకలో...

దుబ్బాక, జూన్ 8: మృగశిర కార్తె సందర్భంగా శనివారం దుబ్బాకలో చేపలు కొనుగోలు చేసేందుకు ప్రజలు భారీగా తరలివచ్చారు. ఇక్కడి సంతకు మత్స్యకారులు దుబ్బాక చెరువు, రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మానేరు వాగు నుంచి చేపలు పట్టుకుని భారీగా తీసుకువచ్చారు. కొర్రమీను (కొర్రమట్ట) చేపలు కిలో రూ.700 వరకు విక్రయించారు.

దుబ్బాక: చేపలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

సిద్దిపేట: చేపలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన

మెనుస్ట్రువల్ కప్‌లను ప్రదర్శిస్తున్న ప్రజాప్రతినిధులు, మహిళలు

హుస్నాబాద్‌టౌన్, జూన్ 8: మహిళలు నెలసరిలో మెనుస్ట్రువల్ కప్‌లను ఉపయోగించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న సూచించారు. బాలవికాస ఆధ్వర్యంలో శనివారం వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ మహిళలు నెలసరిసమయంలో ప్యాడ్స్‌ను ఉపయోగించడంతో సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ప్యాడ్స్‌తో ఆరోగ్యం దెబ్బతినడంతోపాటు వాతావరణకాలుష్యం సైతం కారణమవుతుందని ఆమె హెచ్చరించారు. మహిళలు తప్పనిసరిగా మెనుస్ట్రువల్‌కప్‌లను ఉపయోగించుకుని ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలకు మెనుస్ట్రువల్ కప్‌లను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్‌వైస్‌చైర్ పర్సన్ అయిలేని అనిత, బాలవికాస విడోప్రోగాం మేనేజర్ మంజుల, బాలవికాస ప్రతినిధులు జ్యోతి, నిర్మల, శ్రీమతి, పలువురు మహిళలు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపులు మూసివేయాలి

- ఎక్సైజ్ కార్యాలయానికి తరలివచ్చిన మహిళలు

ఎక్సైజ్ శాఖ కార్యాలయం వద్ద చిట్యాల గ్రామ మహిళలు

చేర్యాల, జూన్ 8 : చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లో బెల్ట్‌షాపులు విచ్చలవిడిగా వెలుస్తున్నా వాటిని నియంత్రించాల్సిన అధికారులు మామూళ్లకు అలవాటు పడి పట్టించుకోవడం లేదు. నాలుగు మండలాల పరిధిలోని 53 గ్రామాల్లో గ్రామానికి 10 చొప్పున బెల్ట్‌షాపులు కొనసాగుతున్నాయి.గ్రామాల్లోని బెల్ట్ షాపుల్లో ఎప్పుడు పడితే అప్పుడు మందు దొరుకుతుండంతో మందుబాబులు మద్యం తాగి ఇంట్లో గొడవలకు దిగడం, భార్యా పిల్లలను వేధిస్తున్నారు. రోజురోజుకు పెరిగిపోతున్న బెల్ట్‌షాపులను వెంటనే మూసివేయించాలని డిమాండ్ చేస్తూ చేర్యాల మండలంలోని చిట్యాల గ్రామానికి చెందిన మహిళలు శనివారం ఎక్సైజ్ అధికారులను ఆశ్రయించారు. తమ గ్రామంలో బెల్ట్‌షాపులు ఏర్పాటు చేసి మబ్బుల మొదలుకొని అర్ధరాత్రి వరకు నిర్వాహకులు మద్యం విక్రయాలు కొనసాగిస్తున్నారని వారు ఆరోపించారు. గ్రామంలో అడ్డగోలుగా షాపులు ఏర్పాటు చేసి యథేచ్ఛగా మద్యం విక్రయిస్తున్నారని, ఎప్పుడుపడితే అప్పుడు తాగి వచ్చి ఇంట్లో గొడవలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల గ్రామంలో ఓ వ్యక్తి తాగి వచ్చి గొడవపడి భార్య పై పెట్రోల్ పోశాడని, మందు ఎక్కువై ఓ వ్యక్తి తాను చచ్చిపోతానంటూ పురుగుల మందు తాగాడని తెలిపారు. గ్రామంలో పచ్చని కుటుంబాల్లో చిచ్చురేపుతున్న బెల్ట్‌షాపులను వెంటనే మూసివేయించాలని డిమాండ్ చేశారు.బెల్ట్‌షాపుల విషయంపై పోలీసులను సైతం కలిసి మహిళలు తమ బాధను వెల్లడించారు.

హుస్నాబాద్‌లో..

హుస్నాబాద్, జూన్ 8: పట్టణాలు, గ్రామాలు అనే తేడా లేకుండా ఎక్కడ పడితే అక్కడ అక్రమంగా నడుస్తున్న బెల్టుషాపులను వెంటనే మూసివేయించాలని బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ ప్రకటనలో డిమాండ్ చేశారు. హుస్నాబాద్ పట్టణంలోని పలు బార్లు, వైన్స్‌ల సహకారంతో ఇష్టారాజ్యంగా బెల్టుషాపులు నడిపిస్తున్నా సంబంధిత ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పట్టణంలోని రెండు బార్ అండ్ రెస్టారెంట్ల నుంచి రూ.30 నుంచి రూ.50 ఎక్కువ చెల్లించి బెల్టుషాపు నిర్వాహకులు కింగ్‌ఫిషర్ బీర్లు తీసుకెళ్లి బెల్టు షాపుల్లో ఒక్కోటి రూ.250లకు విక్రయిస్తున్నారని తెలిపారు. యూత్ మొత్తం బీర్లు ఎంత ధర అయినా చెల్లించి కొనుగోలు చేసి ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. ఎక్సైజ్ అధికారులు స్పందించి బెల్టుషాపులను మూసి వేయించాలని, లేకుంటే బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

బస్సు ప్రారంభం

దుబ్బాక, జూన్ 8: దుబ్బాక డిపో నుంచి యాదగిరిగుట్టకు ఎక్స్‌ప్రెస్ బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం దుబ్బాక నుంచి సిద్దిపేట మీదుగా యాదగిరిగుట్టకు ఆయన బస్సును ప్రారంభించారు. కార్యక్రమంలో టీఐ కనకలక్ష్మి, ఉద్యోగులు పాల్గొన్నారు.

పాఠశాలలను పునఃప్రారంభిస్తాం

జగదేవ్‌పూర్, జూన్ 8: మండలంలోని పలు గ్రామాల్లో మూతబడిన ప్రభుత్వ పాఠశాలలను పునఃప్రారంభిస్తామని ఎం ఈవో ఉదయభాస్కర్‌రెడ్డి అన్నారు. గతం లో నడిచి మూతబడిన అలిరాజ్‌పేట, నిర్మల్‌నగర్ పాఠశాల భవనాలను శనివారం ఆయన పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మూతబడిన ప్రభుత్వ స్కూళ్లను తిరిగి ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. రాంనగర్ పాఠశాలను ప్రారంభిస్తామని తెలిపారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం సైదులు, అంగన్‌వాడీటీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

The public in general are here by informed that Sri. Palle Anjaiah Son of Balakistaiah, Resident of Siddipet, has approached my client bank/ finance and release of loan and offered his property of Open Plot No. 54 situated in Sy No. 2183, 2184, 2185, 2186, 2187 to an extent of 200 Sq.Yds situated at Old G.P. Gadicherlapally, Now Merged in Siddipet Municipality, Dist: Siddipet and the same was bounded by East : Plot No. 53, West : Plot No. 55, North: Road 24 Feets, South: Plot No. 63 acquired through Registered sale Deed D.No. 7423/ 2022 SRO Siddipet and further informed that its Original link Registered Sale Deed Vide D.No. 7190/2004 SRO Siddipet pertaining to above property was lost. Hence the general Public are informed to submit objections/claims if any within (7) days of this publication to me, for sanction and release of loan in respect of the above property in favour of Sri. Palle Anjaiah and mortgaging the same in favour of my client bank/Finance. If no objections are received within the above stipulated time, it shall be deemed that there are no objections and my client will proceed further, Later no objections will be entertained.

Sd/- **Pinna Ramulu,** M.A., LL.M
Advocate & Notary
Siddipet, Cell No. +91 9849321422